# కూర్చున్న సీటేంది? కూస్తున్న కూతలేంది?

- సీఎం భాష తీవ్ర అభ్యంతరకరం
- తెలంగాణ ప్రతిష్ఠ నాశనం
- గ్యారెంటీలు అమలుచేయాల్సిందే
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద
- రివేంజ్‌రెడ్డిగా రేవంత్: దాసోజు
- బీఆర్ఎస్ అంటే భయమెందుకు: గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి



తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానందగౌడ్, చిత్రంలో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, వినయ్‌భాస్కర్, బీఆర్ఎస్ నేతలు వంటేరు ప్రతాప్‌రెడ్డి, దత్తాత్రేయ, విజయ్ ఆర్యా

హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): 'రేవంత్‌రెడ్డి కూర్చున్న సీటు విలువ ఏంది? కూస్తున్న కూతలేంది? ప్రజావేదికలపై ఆయన మాట్లాడే భాష తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నది' అని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కావాలనే సీఎం రేవంత్ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శనివారం ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణను తెచ్చిన, దేశంలోనే ఉన్నతంగా తీర్చిదిద్దిన కేసీఆర్ చావును కోరుకునే వ్యక్తి సీఎం సీట్లో కూర్చున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ పేరు లేకుండా రేవంత్ ఉపన్యాసమే ఉండటం లేదని విమర్శించారు. ఆయన మాట్లాడే భాషను కనీసం గల్లీ లీడర్ కూడా మాట్లాడరని పేర్కొన్నారు. తెలంగాణ ప్రతిష్ఠనే ఆయన నాశనం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. ఆరు గ్యారెంటీలను అమలు చేసేదాకా కాంగ్రెస్ సర్కార్‌ను వదలబోమని హెచ్చరించారు.

**రివేంజ్‌రెడ్డిగా మారిన రేవంత్: దాసోజు**

సీఎం రేవంత్‌రెడ్డి రివేంజ్‌రెడ్డిగా మారారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ విమర్శించారు. ఆయనతో కాంగ్రెస్ కార్యకర్తలూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి.. రేవంత్‌రెడ్డితో నిజం చెప్పించారని, అందుకే 'నేను ప్రజల కోసం సీఎం కాలేదని, పగ కోసం సీఎం అయ్యాను' అని రేవంత్‌రెడ్డి బహిరంగ సభలోనే చెప్పారని తెలిపారు. పగతో, కక్షతో పాలన చేస్తున్న రేవంత్‌రెడ్డికి ముఖ్యమంత్రిగా ఉండే అర్హత లేదని ధ్వజమెత్తారు. కేసీఆర్ మానసికంగా చాలా గట్టివాడని, ఆయన తిరిగి ప్రజల్లోకి వస్తారని తెలిపారు. రాష్ట్రానికి పట్టిన చీడపురుగు రేవంత్‌రెడ్డి అని, అచ్చం ఫ్యాక్షనిస్టులా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

**బీఆర్ఎస్ అంటే భయం?: గొంగిడి**

బీఆర్ఎస్ అంటే కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలకు ఎందుకంత భయమని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత ప్రశ్నించారు. తుర్కపల్లిలో సీఎం సభ జరిగితే.. ఆలేరు నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నేతలందరినీ ఎందుకు అరెస్టు చేశారని ప్రశ్నించారు. ఆ సభలో రేవంత్ పచ్చిఅబద్ధాలు మట్లాడారని దుయ్యబట్టారు. 2015లోనే కేసీఆర్ వైటీడీఏ ఏర్పాటు చేశారని, ఆయన కట్టించిన కాళేశ్వరం ప్రాజెక్టు నుండే గంధమళ్లకు నీళ్లు వస్తున్నాయని తెలిపారు. 2023లోనే యాదగిరిగుట్టలో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు జీవో వచ్చిందని ఈ సందర్భంగా ఆమె గుర్తుచేశారు. అయినా ఏడాది క్రితం రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు తీసుకెళ్లే ప్రయత్నం చేశారని ఆరోపించారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు డీ లావణ్య. స్వస్థలం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి. భర్త ఇంద్రదేవ్ ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేసేవాడు. ఓ రోజు అనారోగ్యం బారినపడ్డాడు. రూ.10 లక్షలు అప్పు చేసి చికిత్స చేయించారు. అయినా ఫలితం లేకుండా పోయింది. 2022 జూన్‌లో ఇంద్రదేవ్ కన్నుమూశాడు. ఆరేండ్ల పాప, పదేండ్ల బాబు. పుట్టెడు అప్పులు, కుటుంబం గడిసే పరిస్థితి లేదు. కొండంత ఆశతో ఆర్టీసీలో కారుణ్య నియామకం (బ్రెడ్‌విన్నర్) కోసం దరఖాస్తు చేసుకున్నది. సర్టిఫికెట్ వెరిఫికేషన్, ఫిజికల్ టెస్ట్ అన్ని పూర్తయ్యాయి. ఒక్క వయోపరిమితి అడ్డంకిగా వచ్చిపడింది. ఏడాది అధికంగా ఉన్నందుకు అధికారులు ఉద్యోగమివ్వలేదు. మంత్రి పొన్నం ప్రభాకర్ సహా అధికారులను కలిసి కనికరించమని వేడుకున్నా ఫలితం లేకుండా పోయింది.

# కారుణ్య ఉద్యోగం.. సర్కారు కాఠిన్యం

- బాధితులకు శాపంగా గరిష్ఠ వయోపరిమితి
- వయోపరిమితి తీరడంతో ఉద్యోగాలివ్వని వైనం
- సింగరేణి, పంచాయతీ రాజ్‌శాఖలో సడలింపు
- మిగతాశాఖలు, బోర్డుల్లో సడలించడంలో జాప్యం



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు బానోతు శివలాల్. తండ్రి నీటిపారుదల శాఖలో లష్కర్‌గా పనిచేస్తూ మరణించాడు. బీకాం, బీఈడీ చదివిన శివలాల్‌కు దివ్యాంగురాలైన కూతురు, మంచంపట్టిన తల్లి ఉన్నారు. తండ్రి ఉద్యోగం కోసం శివలాల్ దరఖాస్తు చేయగా, 40 ఏండ్లు నిండిన కారణంగా తిరస్కరించారు. దాదాపు 15 నెలలుగా సచివాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. అయిన ఫలితం లేకుండా పోయింది.

హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): కారుణ్య ఉద్యోగం కోసం వయోపరిమితి మీరిన బాధితులు దాదాపు 1,500పైనే ఉన్నారు. ఒక్క ఆర్టీసీలోనే 100 మంది వరకు ఉండగా, నీటిపారుదలశాఖలోనూ పదుల సంఖ్యలో ఉన్నారు. ఇంటి పెద్ద మరణించడం.. పీడిస్తున్న అప్పులు.. కారుణ్య కోటాలో ఉద్యోగం దక్కకపోవడంతో బాధిత కుటుంబాల్లో తీరని ఆవేదన నెలకొంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి.. వన్ టైం సెటిల్‌మెంట్ కింద అందరికీ వయోపరిమితి సడలించి, ఉద్యోగాలు కల్పించాలని బాధితులు కోరుతున్నారు.

**ఆగమ్యగోచరంగా..**

ప్రభుత్వ ఉద్యోగి అకస్మాత్తుగా చనిపోతే అతనిపై ఆధారపడ్డ కుటుంబం పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారవుతున్నది. కుటుంబ పోషణ భారమై కొందరైతే కూలీనాలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం కుటుంబ సభ్యుల్లో ఒకరికి కారుణ్య నియామకాల్లో అవకాశం కల్పించాలి. ఆఫీస్ సబార్డినేట్, జూనియర్ అసిస్టెంట్‌లో ఏదో ఒక ఉద్యోగమిస్తారు. ఈ ఉద్యోగాల భర్తీలో జనరల్ క్యాటగిరీ వారికి 35 ఏండ్లు, ఎస్సీ,ఎస్టీ, బీసీలకు 40 ఏండ్ల వయోపరిమితిని అమలుచేస్తున్నారు. అంతలోపు ఉంటేనే కారుణ్యనియామకాల్లో అవకాశం కల్పిస్తున్నారు. ఒక్కరోజు దాటినా ఉద్యోగం కల్పిండచంలేదు. ఈ ఒక్క ఈ నిబంధనతో వందలాది కుటుంబాలు ఉద్యోగాలకు దూరమయ్యాయి.

**వీళ్లేం పాపంచేశారు..**

ఉద్యోగ నియామకాల్లో గరిష్ట వయోపరిమితిని ప్రభుత్వం 10 ఏండ్లు పెంచింది. జనరల్ అభ్యర్థులు 44, ఇతర అభ్యర్థులకు 49 ఏండ్లుగా ఉంది. దివ్యాంగులకు 50 ఏండ్ల వయస్సులోనూ ఉద్యోగాలకు పోటీపడే అవకాశాన్నిచ్చారు. కారుణ్య నియామకాలకు సడలింపు 39-40 ఏండ్లలోపే వర్తింపజేస్తున్నారు. వయోపరిమితి సడలింపు కారుణ్య నియామకాలకు ఎందుకివ్వరని ఉద్యోగ సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు.

**వారికి మోదం.. వీరికి ఖేదం**

కారుణ్య నియామకాల్లో వయోపరిమితి సడలింపు విషయంలో సర్కారు రెండు నాల్కల ధోరణిని అవలంబిస్తున్నది. ఒక్కో దగ్గర ఒక్కో విధానాన్ని అనుసరిస్తున్నది. ఇటీవలే సింగరేణిలో (డిపెండెంట్ ఉద్యోగాల్లో) ఐదేండ్ల సడలింపునిచ్చి కారుణ్య నియామకాలు జరిపారు. పంచాయతీరాజ్‌శాఖలోనూ సడలించి ఏకంగా 585 మందికి ఉద్యోగాలిచ్చారు. కానీ మిగతాశాఖల్లో వర్తింపజేయడంలేదు. ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగి చనిపోగా, ఆయన భార్యకు కేవలం 16 రోజులు ఎక్కువున్నందుకు అధికారులు ఉద్యోగం నిరాకరించారు.

## ఇందిరమ్మ ఇల్లు రాలేదని ఆత్మహత్యాయత్నం

- కామారెడ్డి జిల్లా లో ఘటన

లింగంపేట, జూన్ 7: ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని సంతోషపడ్డాడు. ఇల్లు కట్టుకునేందుకు డబ్బుకు ఇబ్బంది రావొద్దని పొలం అమ్మేశాడు. తీరా లబ్ధిదారుల జాబితాలో పేరులేకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం కోర్పోల్‌లో జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. కోర్పోల్‌కు చెందిన నర్సని కాశీరాంకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని, మొదటి జాబితాలోనే పేరు వచ్చిందని స్థానిక కాంగ్రెస్ నాయకులు సమాచారం ఇచ్చారు. సంతోషపడ్డ కాశీరాం.. అధికారులు వచ్చి మార్కింగ్ చేస్తారన్న నమ్మకంతో తన గుడిసెను తొలగించి స్థలం చదును చేశాడు. ఇంటి నిర్మాణ సమయంలో డబ్బులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్తగా తనకున్న ఎకరం భూమిలో అర ఎకరం విక్రయించాడు. తీరా తుది జాబితా లో పేరు లేకపోవడంతో మనస్తాపానికి గురై శనివారం గడ్డిమందు సేవించాడు. కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేటు దవాఖానకు తరలించారు.



శనివారం ఆసిఫాబాద్‌లో భారీ ర్యాలీ తీస్తున్న ఆదివాసీలు



ధర్నాలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్. చిత్రంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి తదితరులు

# 'టైగర్ కారిడార్'ను ఒప్పుకోం

- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఆదివాసీలు
- ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ర్యాలీ
- కలెక్టరేట్ ఎదుట బైఠాయింపు
- జీవో 49 రద్దు చేయాలని డిమాండ్
- ఆందోళనకు బీఆర్ఎస్ నేతలు, ప్రజా సంఘాల మద్దతు
- మరో కుమ్రంభీం పోరాటానికి సిద్ధమని నేతల హెచ్చరిక

కుమ్రంభీం ఆసిఫాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ) : కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా అడవులను టైగర్ కారిడార్‌గా ఏర్పాటు చేస్తుండటాన్ని ఆదివాసీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన బాటపట్టారు. శనివారం జిల్లా నలుమూలల నుంచి ఆదివాసీలు వందలాదిగా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకొని భారీ ర్యాలీ తీశారు. తుడుం వాయిద్యాలతో కుమ్రంభీం చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు చేరుకొని అక్కడ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అక్కడి నుంచి వివేకానంద చౌక్ మీదుగా కలెక్టరేట్ వరకు కదం తొక్కారు. కలెక్టరేట్ ఎదుట బైఠాయించి టైగర్ కారిడార్ వద్దే వద్దంటూ నినాదాలు చేశారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, మాజీ ఎంపీ సోయం బాబురావు మద్దతు ప్రకటించి.. ఆందోళనలో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభమైన ఆందోళన సుమారు ఐదుగంటలపాటు కొనసాగింది. సర్కారు వెనక్కి తగ్గకపోతే మరో కుమ్రంభీం పోరాటం మొదలవుతుందని హెచ్చరించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ.. దశాబ్దాలుగా గిరిజనులు సాగు చేసుకుంటున్న అటవీ భూములకు కేసీఆర్ పట్టాలిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ భూములను సాగు చేసుకోకుండా అడ్డుకుంటున్నదని విమర్శించారు. టైగర్ కారిడార్ పేరుతో ఏకంగా గిరిజనుల భూములను పూర్తిగా స్వాధీనం చేసుకునేందుకు కుట్రలు చేస్తున్నదని మండిపడ్డారు. టైగర్ కారిడార్ పేరుతో ప్రభుత్వం విడుదల చేసిన జీవో 49ని వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలంతా ఏకమై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఇంద్రవెల్లి సభలో ఆదివాసీలపై ప్రేమను ఒలకబోసిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఆసిఫాబాద్ జిల్లా గిరిజనులపై ఎందుకు వివక్ష చూపుతున్నారని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని అడవులను ఆక్రమించేందుకు జింకలను చంపిన రేవంత్‌రెడ్డి సర్కార్.. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పులులను కాపాడేందుకు ఆదివాసీలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. జిల్లాలోని మారుమూల గ్రామాలకు ఇప్పటికే రోడ్లు వేయకుండా అడ్డుకుంటున్నారని, ఆదివాసీలు నివసించే ఆసిఫాబాద్ అడవులను ఖాళీచేయించేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. నేషనల్ టైగర్ కన్జర్వేషన్‌కు రూ.7,700 కోట్ల నిధులు తెస్తున్న ప్రభుత్వం ఐటీడీఏను ఎందుకు నిర్వీర్యం చేస్తుందో చెప్పాలని, ఆదివాసీల బతుకులు ఆగం చేసేందుకు ప్రయత్నిస్తే ఎంతటి ఉద్యమానికైనా సిద్ధమని హెచ్చరించారు.



పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం పుట్నూర్ గ్రామంలోని దుర్గం లక్ష్మికి చెందిన గుడిసె



న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరిన పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం పుట్నూర్ గ్రామ మహిళలు

# ఇందిరమ్మ జాబితాల్లో గోల్‌మాల్

## అర్హులకు, గుడిసె వాసులకు దక్కని ఇండ్లు

### మొదటి జాబితాలో పేర్లున్నా ఆ తరువాత మాయం

- ఇందిరమ్మ కమిటీల పేరుతో మాయాజాలం
- కాంగ్రెస్ నాయకుల అనుచరులకే అవకాశం
- వంతపాడుతున్న అధికారులు

కరీంనగర్, జూన్ 7 (నమస్తేతెలంగాణ ప్రతినిధి/పాలకుర్తి) : ఇందిరమ్మ ఇండ్లు పూర్తిగా అర్హులకే ఇస్తాం.. ఎవరూ ఎటువంటి అక్రమాలకు పాల్పడినా సహించేది లేదంటూ ఊదర గొట్టే మాటలు చెప్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నది. నిబంధనలకు పాతరేసి.. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు చెప్పిన వారినే ఎంపిక చేస్తున్నారు. నిబంధనలను ప్రభుత్వం తుంగలో తొక్కడంతో అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావడం లేదు. దీనికి నిలువెత్తు నిదర్శనం.. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం పుట్నూర్ గ్రామంలోని పలువురు నిరుపేదలే.

**మా గుడిసెలు కనపడలేదా?**

పుట్నూర్ గ్రామంలో 30 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనట్టు అధికారులు చెప్తున్నారు. నిబంధనల ప్రకారం ముందు వరుసలో ఉండాల్సిన నిరుపేదలకు మాత్రం జాబితాలో అవకాశం దక్కలేదు. ఏండ్ల తరబడి గుడిసెల్లోనే ఉంటున్న వారిని పక్కన పెట్టారు. గ్రామ సభలు జరిగినప్పుడు.. సదరు నిరుపేదలకు మంజూరు అయినట్టు పేర్లు చదివిన అధికారులు తీరాచూస్తే.. పైనుంచి జాబితా వచ్చిందని చెప్తున్నారు. 'మేము ఉంటున్న తాటికమ్మల గుడిసెలు.. తడువకుండా వేసుకున్న కవర్లు.. ఇల్లు లేక అష్టకష్టాల పడుతున్న తీరు.. సర్వేకు వచ్చినప్పుడు కాళ్లావేళ్లా పడి ఈసారైనా మాకు న్యాయం చేయండి' అంటూ వేడుకున్నంటున్న మా దీన స్థితి.. సర్వేకు వచ్చిన అధికారులకు కనబడలేదా? అని పాలకుర్తి మండలం పుట్నూర్ గ్రామ నిరుపేదలు ప్రశ్నిస్తున్నారు. గ్రామంలోని పలు కుటుంబాలు కఠిక పేదరికంతో గుడిసెల్లో ఉంటున్నారని తెలిపారు. నిజానికి తమకంటే గ్రామంలో నిరుపేదలు ఉండరని, పైఅధికారులు వచ్చి చూస్తే అన్నీ తెలుస్తాయని వారంటున్నారు. గ్రామ సభలు జరిగినప్పుడు.. తమ పేర్లున్నాయని చెప్పి.. ఇప్పుడు తమ పేర్లు కనిపించకుండా చేశారని వారు భగ్గుమంటున్నారు. డబ్బులుర ఉన్నోళ్లకు, భూములున్నోళ్లకు, చోటామోటా నాయకులకు, డబ్బులు ఇచ్చిన వారికి ఇందిరమ్మ ఇండ్లు వచ్చాయని ఆరోపిస్తున్నారు. గ్రామానికి 30 ఇండ్లు వస్తే.. ముందుగా ఉండాల్సిన తమ పేర్లు లేకపోవడం ఎంపికలో ఎంత అన్యాయం జరిగిందో చెప్పడానికి నిదర్శనమని అంటున్నారు.



### నాకు ముగ్గురు ఆడపిల్లలు.. కనికరించండి

ఎన్నికల్లో చేతిగుర్తుకు ఓటేస్తే ఇందిరమ్మ ఇల్లు ఇస్తామన్నారు. చేతిగుర్తుకు ఓటేసినా మాకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వలేదు. ముగ్గురు ఆడపిల్లలతో కూలి పని చేసుకుని బతుకుతున్న. ఊళ్లో నాకంటే పేద వాళ్లు ఎవరూ లేరు. బాగా ఉన్నోళ్లకు ఇండ్లు ఇచ్చిండ్రు. గ్రామంలో 30 మందికి ఇండ్లు ఇస్తే నాలాంటి పేదోళ్లకు మాత్రం రాలేదు. ఈ విషయాన్ని కలెక్టర్‌కు కూడా చెప్పినం. ఒకసారి మా గ్రామానికి వచ్చి మేం చెప్పేది నిజమో కాదో చూస్తే తెలుస్తుంది. గ్రామ సభల్లో మేం ఎంపికైనట్టు చెప్పిండ్రు. ఇప్పుడు అడిగితే మాత్రం మా చేతుల్లో ఏమీ లేదు.. అంతా పైనుంచి వచ్చిందని చెపుతుండ్రు. పోనీ మాకెప్పుడు ఇస్తరో చెప్పండ్రి అంటే చెప్తలేరు. పేదోళ్లకు ఇస్తమని చెప్పి.. పెద్దోళ్లకు, కాంగ్రెసోళ్లకు ఇస్తుండ్రు. కలెక్టర్, అధికారులు వచ్చి చూసి మాకు న్యాయం చేయాలి. - దుర్గం లక్ష్మి, పుట్నూర్

### అప్పడున్న పేరు ఇప్పడేమైనట్టు?

ఇందిరమ్మ ఇండ్ల కోసం అందరిలాగే దరఖాస్తు చేసుకున్నం. గ్రామ సభరోజు మా పేరు చదివిండ్రు. మాకు ఇల్లు వచ్చిందన్నరు. ఇప్పుడు మాత్రం లేదంటున్నరు. గ్రామ పంచాయతీ అధికారులను అడిగితే.. పై నుంచే పేర్లు వచ్చినయి.. మమ్మల్ని ఏమి జేయమంటరు? అంటుండ్రు. మాకేమి సంబంధం లేదంటుండ్రు. గ్రామంలో మా కంటే పేదవారు ఎవరూ లేరు. ఆర్థికంగా ఉన్నవాళ్లకు, నాయకుల దగ్గరోళ్లకు మాత్రం ఇండ్లు ఇచ్చిండ్రు. మేమేం పాపం జేసినమని మాపేర్లు ఎందుకు తొలగించిండ్రో చెప్పాలె.

- దండుగుల లక్ష్మి, కూలి, పుట్నూర్



### దివ్యాంగుడినైనా ఇల్లు ఇవ్వలేదు



నాకు 90 శాతం అంగవైకల్యం ఉంది. చెయ్యిలేదు. కాళ్లులేవు. మంచంలో ఉన్న. పూరిగుడిసెలో ఉంటున్న. నేను ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న. మొదట నాకు ఇల్లు వచ్చిందని చెప్పిండ్రు. సర్వే తర్వాత నా పేరు తొలగించిండ్రు. అర్హత ఉన్నప్పటికీ అధికారులు, నాయకులు కుమ్మక్కై నాకు ఇల్లు ఇవ్వలేదు. కలెక్టర్ సార్ చొరవచూపి గ్రామంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి. నాయకులు చెప్పినవారిని కాకుండా గుడిసెల్లో ఉంటున్న వారిని గుర్తించి న్యాయం చేయాలె. - కాల్వ తిరుపతి, పుట్నూర్


**Bhavana Rishi Co-Operative Urban Bank Ltd.**
(Regd. No. T.B.469)
13-23-30/3, Krishnaveni Nagar Colony,
Saroornagar, R.R.District, Hyderabad - 500035.

**NOTICE OF 28TH ANNUAL GENERAL BODY MEETING**

The 28th Annual General Body Meeting of the Bhavana Rishi Cooperative Urban Bank Ltd., (T.B.No.469) Krishnaveni Nagar Colony, Gaddiannaram, Saroornagar, Hyderabad, R.R.District will be held on 28-06-2025 (Saturday) at 10.30 A.M. at Babu Jagjeevan Ram Bhavan, 9G8V+83H, beside Rythu Bazar, Kothapet (After Chaitanyapuri), Hyderabad – 500 035 to transact the following business in the Agenda.

**Agenda:**
1. To consider to approve the 27th Annual Administration Report for the year 2024-25.
2. To consider the letter RC No : 2192/2018-C, dated 26-04-2025 received from Joint Registrar / Dist. Co-Operative Officer , Ranga Reddy Dist. along with the statutory inspection report conducted under section 52 of the TCS Act 1964 with a request to hold the special general body meeting and place the findings of the inspection report.
3. To consider to adopt the Statutory Audit Certificate and the Audited Accounts for the year 2024-25.
4. To consider to appropriate net profit, payment of dividend and transfer to other funds.
5. To consider to note the statement of Receipts and Payments for the year 2024-25.
6. To consider to note the statement of Receipts and Payments for the Months of March, April & May 2025.
7. To consider to approve the Budget Estimates for the year 2025-26 and Performance Budget for the year 2024-25.
8. To approve all investments made /Redemptions / Borrowings / Securities Purchase / Sold from 01.03.2025 to 31.05.2025.
9. To consider the report of admission of new members, allotment of additional shares to members, transfer of shares between members, withdrawal and refund of share capital to members during the period 01.03.2025 to 31.05.2025.
10. To consider to carry undrawn dividend for the year 2021-22 to the Reserve Fund of the Bank in terms of bylaw No. 43(iv) of the bylaws of the Bank.
11. To consider the report on the loans sanctioned from 01.03.2025 to 31.05.2025.
12. To review all over due loans and loans covered under legal action.
13. To consider to approve the Annual Business Plan for the year 2025-26.
14. To consider to approve Annual Investment Policy 2025-26.
15. Any other subject with the permission of the chair.

*Lunch Follows* (BY ORDER OF THE BOARD OF DIRECTORS) Sd/-

Krishnaveni Nagar, Saroornagar, Hyderabad.
Date: 06-06-2025.

K V Ramana Reddy
Managing Director/CEO.

**IMPORTANT NOTICE TO MEMBERS:**
1. According to Section 19(4) of the TSCS Act, 1964 every member admitted shall be issued a Photo identity Card.
2. Members are required to bring their identity cards to the General Body Meeting.
3. Members who have not yet collected the photo identity cards and share certificates are requested to bring two passport size Photographs, Aadhar card & PAN Card and may collect them at the Bank Head Office on any working day between 10.30 AM To 4.30 PM.
4. Please note that as per bylaw no.43 (iv) of the bank, any dividend remaining undrawn for 3 years after having been declared shall be forfeited and shall be carried to Reserve Fund of the bank. Hence, if any member who has not collected dividend, he / she may collect dividend warrants for the years 2022-23, 2023-24 & 2024-25 from the bank.
5. Members are requested to note that according to Section 21 of the TSCS Act,1964 a person shall be disqualified for being admitted as, and for being a member, if he / she.
a). fails to transact such minimum business or utilize minimum services or facilities in a year as may be specified in the bye laws, or
b). fails to attend two consecutive General Body meetings in two years without leave of absence or
c). fails to give information relevant to him/her to the Bank as specified in the bye laws.
6. According to bye law no.9A (a) (vi) any member who fails to avail the services of the Bank in the shape of a loan or who fails to keep any deposit account with the Bank is not eligible either to be admitted as member or to continue as such.
7. The Annual Administration Report can be obtained on 28-06-2025 at the venue of the General Body meeting or at the Bank's Head office on any working day after Annual General Body meeting.